

తిరుపతిలో స్పిరిచ్యువల్ స్ట్రీట్

- ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఒక వీధి ఏర్పాటు ఆలోచనలో కార్పొరేషన్
- ఇస్కాన్, అలిపిరి, కపిలతీర్థం రోడ్లలో ఒకటి ఎంపికచేసే అవకాశం

ప్రసిద్ధ ఆలయాలకు నాలుగు వైపులా ఉండే రోడ్లను మాడవీధులు అంటారు. వీటిని పవిత్రమైన ప్రదేశాలుగా భావిస్తారు. ఆలయాల క్షేత్రమైన తిరుపతి నగరం మొత్తం పవిత్రమైనదే! అందుకే తిరుపతి నగరంలో స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసే దిశగా నగర పాలకసంస్థ అధికారులు ఆలోచిస్తున్నారు. దాదాపు లక్ష మంది దాకా రోజూ తిరుపతి నగరంలోకి వస్తుంటారు. వీరు ఈ రోడ్డులోకి అడుగు పెట్టగానే ఒక ఆధ్యాత్మిక దివ్యానుభూతికి లోనయ్యేలా ఉండాలన్నది ఉద్దేశ్యం. పర్యాటకంగానూ ఇది లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నారు. కమిషనర్ మౌర్య ఈ ఆలోచనకు ఆచరణ రూపం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌ను నగరంలో ఎక్కడ ఏర్పాటు చేయాలన్న చర్చ నడిచినట్లు తెలిసింది. గాంధీరోడ్డు, గోవిందరాజుల ఆలయప్రాంతం, బస్టాండు, రైల్వేస్టేషన్ వంటి చోట్ల ఇటువంటి ఏర్పాటు సాధ్యం కాదని అనుకుంటున్నారు. తిరుమలకు వెళ్లే యాత్రికులకు కూడా ఉపయోగపడేలా ఉండాలన్నది ఆలోచన. ఇందుకోసం ఇస్కాన్‌రోడ్డు, కపిలతీర్థం, అలిపిరి ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

డివైన్ వాక్

స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లోకి ప్రవేశించగానే మనసుకు ప్రశాంతత చేకూరాలి. ఆధ్యాత్మిక అనుభూతి కలగాలి. ట్రాఫిక్ గందరగోళం, హారన్లు, అరుపులు ఉండవు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వేదమంత్రాలు, భజనలు, కీర్తనలు, నాదస్వరం మంద్రస్వరంలో వినిపిస్తాయి. సంప్రదాయ దేవాలయ శైలిలోనే లైటింగ్ కూడా ఉంటుంది. దుకాణాలు కూడా ఇదే పద్ధతిలో ఉంటాయి. ఈ వీధిలో ఏవి పడితే అవి విక్రయించరు. తులసి మాలలు, ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులు ఉంటాయి. భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతా మూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి లభిస్తాయి. టీటీడీ సౌజన్యంతో వారంలో ఒకరోజు, లేదా ప్రతి నిత్యం తిరుమల సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు. స్పిరిచ్యువల్ స్ట్రీట్‌లో వాహనాలను అనుమతించరు. కేవలం నడక మాత్రమే ఉంటుంది. నడవలేని స్థితిలో ఉండేవారి కోసం బ్యాటరీ వాహనాలుంటాయి. స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఎంపికలో ఇదే పెద్ద సవాలుగా మారుతుంది. వాహనాలను అనుమతి లేదంటే ఆ ప్రాంతపు ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధుల సహకారంతో దీనిని సాకారం చేసుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెల 1 నుంచీ కూర్చుని తాగండి బాబూ!

- మందుబాబుల కోసం జిల్లాలో 250 మద్యం షాపులకు పర్మిట్ రూములు
- ఏడాదికి రూ.16.82 కోట్ల ఆదాయం



పాపం.. మందుబాబులు అందరూ బార్లకు వెళ్లి తాగలేరు కదా! కొందరు షాపుల్లో సీసాలు కొనుక్కుని అక్కడే నిలబడి గుటుక్కున గొంతులో పోసేసుకుంటుంటారు. మరికొందరు ఏ సందుగొందుల్లోనో చాటుకు చేరి గబగబా లాగించేస్తుంటారు. కాస్త నిమ్మళంగా తాగాలనుకునేవాళ్లకి ఊరిచివర పాడుబడిన భవనాలూ, ముళ్లకంపలే దిక్కు. ఈ కష్టం చూడలేక ప్రభుత్వం తాజాగా పర్మిట్ రూములకు అనుమతులు ప్రకటించింది. పైకి ఎన్ని మాటలు చెప్పినా.. ప్రభుత్వ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచేది వీరే కదా మరి! ఏ ప్రభుత్వానికైనా ప్రియమైనవారు వీరే. ఇక వీరికి షాపుల దగ్గర నిలబడి తాగే అవసరం ఉండదు. సెప్టెంబరు 1 నుంచీ దర్జాగా కూర్చుని మందు లాగించవచ్చు. జిల్లాలో 250 మద్యం షాపులున్నాయి. వీరంతా ఇక పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకోవచ్చు. కాకపోతే ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాలి. అమ్మకాలను బట్టీ షాపులకు రెండు రకాల శ్లాబులు నిర్ణయించారు. ఏడాదికి రూ.55 లక్షల లోపు మద్యం అమ్మేవాళ్లు రూ.5 లక్షలు ఏడాదికి చెల్లించాలి. ఈ శ్లాబు కింద 55 షాపులున్నాయి. ఇక రూ.65 లక్షలు దాకా అమ్ముతుంటే రూ.7.50 లక్షలు నిర్ణయించారు. ఈ శ్లాబులో జిల్లాలో 173 షాపులున్నాయి. ప్రస్తుతం సెప్టెంబరు, అక్టోబరు నెలలకు మాత్రమే పర్మిట్ రూములకు రుసుము నిర్ణయించారు. ఆ తర్వాత ఏడాదికి వసూలు చేస్తారు. రెండు నెలల కాలానికే ప్రభుత్వానికి రూ.2.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. ఏడాదికి 16.82 కోట్లు వస్తుందని అంచనా. ఇక పర్మిట్ రూము తాగడానికే పరిమితం. ఇక్కడ వంట పదార్థాలు తయారు చేయడానికి లేదు. షాపు వేళల్లోనే వీటినీ తెరవాలి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మూడో రోజు.. మహిళా ప్రయాణికుల రెట్టింపు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన మూడో రోజైన సోమవారం.. జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల సంఖ్య రెట్టింపైంది. అంతకుముందు సగటును రోజుకు 35వేల నుంచి 40వేల మంది మాత్రమే ప్రయాణించేవారని ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఉచిత ప్రయాణం విస్తృతంగా ప్రజల్లోకి చేరడంతో సోమవారం నాడు 24గంటల్లో జిల్లా వ్యాప్తంగా మహిళలు 81,350మంది, బాలికలు 915మంది రాకపోకలు సాగించారు. దీంతో మూడో రోజునే రెట్టింపు సంఖ్యలో ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోనే అధికసంఖ్యలో మహిళలు స్త్రీ శక్తి పథకం సద్వినియోగం చేసుకున్న జిల్లాలలో తిరుపతికి పదో స్థానం దక్కింది. ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ పథకం వర్తించని బస్సులు ఇక్కడే అధికం.

ఎస్వీఎంసీలో పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్ల ప్రారంభం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలలో (ఎస్వీఎంసీ) రెండేళ్ల కాలవ్యవధి పారామెడికల్(అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. కోర్సులకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను సెప్టెంబరు 8వ తేది సాయంత్రం 5 గంటల్లోపు రూ.100తో కలిపి కళాశాలలోని పారామెడికల్ విభాగంలో అందించాలన్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరులో సంప్రదించాలన్నారు.

చిట్టేడు పొలిమేరల్లో పురాతన చారిత్రక ఆనవాళ్లు





రైతులు పొలంలో దుక్కిదున్నడంతో బయటపడిన ఆనాటి రుబ్బురోలు పత్రం - పురాతన కుండల పెంకులు

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామ పొలిమేరల్లో రెండవసారి మంగళవారం కొన్ని పురాతన చారిత్రక ఆనవాళ్లు బయటపడ్డాయి. గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో ఒక బృందం ఈ చారిత్రక ఆనవాళ్లను పరిశీలించారు. గత రెండు రోజులుగా చిట్టేడు గ్రామదేవత చిట్టేటమ్మ దేవాలయ సమీపంలోని పొలాల్లో రైతులు వరి ఎల్లి దుక్కిలు దున్నుతుండగా 15వ శతాబ్దంలోని చిట్టేడు గ్రామ పాలేదారులకు సంబంధించిన అనేక ఆధారాలు బయటపడ్డాయి. అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు వాడిన మట్టిపాత్రలు, రాతి పనిముట్లు, రుబ్బురోలు, మట్టికుండల పెంకులు బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. అలాగే అనాటి పాలేగార్ల ఆరాధ్య దైవం పురాతన వినాయకుడి రాతి విగ్రహం కూడా బయటపడింది. మత సంబంధమైన ఆచారాలను తెలిపే కొన్ని వస్తువులు కూడా బయటపడినట్లు గోవిందు సురేష్ తెలిపారు. రెండవసారి అధ్యయనంలో మరిన్ని వివరాలు, ఆనవాళ్లు దొరికితే పురావస్తుశాస్త్ర శాఖకు అప్పగిస్తామన్నారు.



చిట్టేడు పొలిమేరలో 17వ శతాబ్దంనాటి వినాయకుడు విగ్రహం

'కిరితారా' ఏర్పాటుకు సహకారం అందిస్తాం

- ఆ సంస్థ ఎండీ, ప్రతినిధులతో కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐఐటీ వద్ద రూ.80కోట్లతో ఏర్పాటు కానున్న కిరితారా రిసార్ట్స్ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మెస్సర్స్ కిరితారా రిసార్ట్స్ సీఈవో, ఎండీ వి.సత్యనారాయణ, టూరిజం ఆర్‌డీ రమణప్రసాద్ మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 500మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు కానున్న కిరితారా రిసార్ట్స్‌కు అన్ని విధాల సహకరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. 'ఆసియాలోనే అతిపెద్దదైన స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయనుంది. లగ్జరీ సూట్స్, విల్లాలు, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ ఉండేలా రిసార్ట్‌ను రూపొందించారు' అని పర్యాటకశాఖ ఆర్‌డీ రమణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరాయుడు, శ్రీనివాసులరెడ్డి, ఆర్కిటెక్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శేషాచలం.. జీవవైవిధ్యం

- ఐఐటీతో కలిసి పరిశోధనలకు చర్యలు చేపడుతున్నాం
- డిజిటల్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తామన్న డీఎఫ్‌వో వివేక్

మంగళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'శేషాచల కొండలు అరుదైన జంతు, వృక్ష, కీటకాలకు నిలయం. ఇక్కడి పక్షులు, సీతాకోకచిలుకలపై ఐఐటీతో కలిసి పరిశోధనలు చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మరోవైపు ఇక్కడి జంతువులు, పక్షులు, కీటకాల ఫొటోలు, వాటి వివరాలను డిజిటలైజ్ చేసి భద్రపరుస్తాం' అని తిరుపతి డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. తిరుపతి నగరం కపిలతీర్థం వద్దనున్న తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా దేవాంగ పిల్లి అంతరించిపోయే దశకు చేరుకుందన్నారు. దీని పరిరక్షణకు, సంతతి పెంపుదలకు ప్రభుత్వం, అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేవాంగ పిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. శేషాచల అభయారణ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీని అభివృద్ధికి వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'తిరుమలలో నీటి వనరులు, ఆహారం సమృద్ధిగా లభించడం, దట్టమైన అడవులు ఉండటంతో ఏనుగులు గుంపులుగా తిరుగుతూ తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. రానున్న ఆరేళ్లలో ఏనుగుల సంతతి భారీగా పెరగనుంది. అడవి జంతువులకు, మనుషులకు మధ్య ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టడంపై దృష్టి సారిస్తున్నాం' అని డీఎఫ్‌వో వివరించారు.

అందుకే చిరుతలు వచ్చేది

'ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలో లభించే ఆహార వ్యర్థాల కోసం శునకాలు వస్తున్నాయి. వాటి కోసం చిరుతలు అటవీప్రాంతం నుంచి ఇటు వస్తున్నాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో, జూపార్కు రోడ్డులో ప్రజలు ఆహార వ్యర్థాలు వేయకుండా.. వేసినా వెంటనే తొలగించేలా కార్పొరేషన్, టీటీడీ అధికారులతో సంప్రదించాం. ఇలా ఆహార వ్యర్థాలు లేకుండా చేస్తే శునకాలు.. చిరుతలూ రావడం ఆగిపోతాయి. ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో తిరిగే శునకాలను పట్టి ఇతర ప్రాంతాలకు తరలించాలని నగరపాలక అధికారులకు లేఖ రాశాం. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి జూపార్కు రోడ్డులో ఫుడ్ కోర్టులు, వర్సిటీలో హాస్టల్ పరిసరాలను తనిఖీ చేశారు' అని డీఎఫ్‌వో వివేక్ తెలిపారు. ఆ సమయంలోనే కొందరు యూట్యూబర్లు అవగాహన లోపంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా పోస్టులు పెట్టారన్నారు.ఇలా పోస్టులు పెడుతున్న వారిని పిలిపించి అవగాహన కల్పిస్తామన్నారు.

ఆ అటవీ భూముల్లో మొక్కలు నాటుతాం

'శ్రీకాళహస్తి మండలం సింహాచల కండ్రిగ వద్ద అటవీ భూముల ఆక్రమణపై హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ఇక్కడ ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దు చేసింది. దీంతో ఆ అటవీ భూముల్లో మొక్కలు నాటి పెంచనున్నాం. దీనిని ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 144 సెక్షన్ పెట్టి మొక్కలు నాటిస్తాం. ఆక్రమణలను సహించం' అని డీఎఫ్‌వో తెలిపారు.



దేవాంగపిల్లికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎఫ్‌వో వివేక్

419 దేవాంగ పిల్లులు

శేషాచల కొండల్లోని శ్రీ వేంకటేశ్వర అభయారణ్యంలో స్లెండర్ లోరీస్ (దేవాంగ పిల్లులు)పై అటవీశాఖ సమగ్ర గణన పూర్తి చేసింది. ఈ సర్వే ప్రకారం 419 దేవాంగ పిల్లులు ఉన్నట్లు అంచనా వేశారు రాత్రి పూట జీవించే ఈ చరజీవి ముఖ్యమైన నివాస ప్రాంతాలను గుర్తించారు. ఈ సర్వే పూర్తి వివరాలను ప్రజలకు అందించేందుకు సిద్ధం చేసిన స్లెండర్ లోరీస్ హ్యాండ్ బుక్‌ను మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సర్వే ద్వారా దేవాంగ పిల్లి నివాస ప్రాంతాలు, సంరక్షణ, ప్రజలలో అవగాహన పెంపు వంటి కార్యక్రమాలతో ఈ అరుదైన జాతి సంరక్షణకు అటవీ శాఖ కృషి చేస్తోంది.

రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్ నేడు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి/రేణిగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ సెంటర్, రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ బుధవారం ప్రారంభం కానున్నాయి. అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో వీటిని ప్రారంభిస్తారని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ప్రజాప్రతినిదులు, అధికారులు, ఆయా పరిశ్రమల యాజమన్యాలు పాల్గొననున్నట్లు తెలిపారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఏపీవో గౌరీశంకరరావు

పాకాల, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ అధికారి గౌరీ శంకరరావు పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పీఎంశ్రీ పథకంలో పాఠశాలలో చేపట్టిన సైన్స్ ల్యాబ్, ఆటస్థలం, ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనులను నాణ్యంగా చేయాలని కోరారు.జిల్లా ఇంజనీర్ రవీంద్ర రెడ్డి, అకడమిక్ అధికారి శివశంకర్, ఎంఈవో బాబ్జీ, ప్రధానోపాధ్యాయురాలు సుమతమ్మ, ఎస్ఎంసీ ఛైర్మెన్ రమేష్, సీఆర్పీ శ్రీనివాసులు, మండల ఇంజనీర్ చంద్ర పాల్గొన్నారు.

23న గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు ఇంటర్వ్యూ

పాకాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ బోధించడానికి గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు ఈ నెల 23వ తేదీ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్ తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డెమో క్లాస్ ఇవ్వాలన్నారు. ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో శనివారం ఉదయం 10-30 గంటలకు కళాశాల కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

అనర్హుల పెన్షన్ల తొలగింపు

భాకరాపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత పింఛన్లలో దివ్యాంగ పెన్షన్లను డాక్టర్ల బృందం పరిశీలిస్తోంది. మంచానికే పరిమితమైన వారిని ఇళ్లకు వెళ్లి చూశారు. వివిధ రకాల వైకల్యాలున్న వారికి చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించారు. పరిశీలనాంశాలతో కూడిన నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. మండలంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు లేని 157 మంది దివ్యాంగ పెన్షన్లకు అనర్హులుగా గుర్తించి తొలగించారు. 55 పెన్షన్లను ఇతర పెన్షన్లుగా మార్చినట్లు అధికారులు తెలిపారు..

దివ్యాంగ పెన్షన్ కోసం అప్పీలు చేసుకోండి

దివ్యాంగ పెన్షన్‌కు అనర్హులుగా నోటీసులు అందుకున్న వారు తాము అర్హులమని భావిస్తే అప్పీలు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారు తమ అర్జీలను స్థానిక ఎంపీడీవోకు అందించాలన్నారు. అధికారులు పరిశీలించి పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం ఆసుపత్రికి హాజరు కావాలని నోటీసు జారీ చేస్తారన్నారు.

రామచంద్రాపురం: మండలంలో వివిధ కేటగిరీల్లో 135 మంది పింఛన్లు రద్దు అయ్యాయి. అనర్హులుగా గుర్తించి వీరికి నోటీసులు అందజేశామని ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు .ప్రత్యేక వైద్యబృందాలు పరిశీలించాక వీరిని అనర్హులుగా తేల్చారన్నారు. 51మందిని వృద్ధాప్య పింఛన్ కేటగిరీలోకి మార్చినట్లు తెలిపారు. పింఛనుదారులు వెంటనే ఎంపీడీవోకు అపీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైద్య బృందంపరిశీలించి అర్హత ఉంటే పింఛను పునరుద్ధరిస్తామన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి


పీవీపురంలో పనులను పరిశీలిస్తున్న డ్వామా అధికారులు

రామచంద్రాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో కూలీలను పెంచి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ కోరారు. మంగళవారం వీవీపురంలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ ఆధారిత మస్టర్ విధానం ద్వారా ఉపాధిలో అక్రమాలకు చెక్ పెడుతున్నామన్నారు. వర్షాల వల్ల భూమి మెత్తపడటంతో ఉపాధి కార్మికులకు మంచి వేతనం లభిస్తుందన్నారు. రూ.307వంతున వచ్చేలా పనులుచేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మస్టర్, రికార్డులను పరిశీలించారు. వేతన బకాయిలు ప్రభుత్వం త్వరలోనే విడుదల చేస్తుందన్నారు. ఏపీవో సుజాత, జేఈఈ భాగ్యలక్ష్మి, సాంకేతిక సహాయకులు గోపి, ఆరోక్య తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించండి

రామచంద్రాపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు గ్రామస్థులు, ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఇన్‌చార్జి ఎస్‌ఐ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ అనుమతి కోరిన వారికి పోలీసులు నంబరు కేటాస్తారన్నారు. విగ్రహాలు ఏర్పాటు సందర్భంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వైర్లకు దగ్గరగా కాకుండా విశాలమైన ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఊరేగింపు వివరాలు ముందుగా తెలపాలన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర


సారె సమర్పిస్తున్న అనిత యాదవ్ దంపతులు

తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమల రేణుక ఎల్లమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనం పక్కనే ఉన్న అతి పురాతనమైన అమ్మవారి ఆలయంలో ఏటా జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, నైవేద్యం, హారతి సమర్పించారు. కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్ దంపతులు బంగారు కాసుల సారెను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తిరుమలశెట్టి శ్రీనివాసులు, కఠారి మోహన్, పూజారి చిలకమ్మ, శ్రీను, బాలకృష్ణస్వామి, నాయుడు పాల్గొన్నారు.

21న అంగన్‌వాడీల నిరసన

వెంకటగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల కోరారు. మంగళవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎఫ్‌ఆర్ఎస్ రద్దు, వేతనాల పెంపు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చే జీవో వెంటనే ఇవ్వాలన్న డిమాండ్‌ల సాధన కోసం ఈ నెల 21న నిర్వహించే నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూని యన్ నాయకులు సుభాషిణి, నిర్మల, సుమతి, సుహాసిని పాల్గొన్నారు.

పంచలోహాల చీరతో కామాక్షీదేవి

కోట, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): కోట మండలం గూడలి లోని సంగమే శ్వర ఆలయంలో ఉన్న కామాక్షీదేవిని మంగళవారం పంచలోహ చీర అలంకరించారు. ఇటీవల అమ్మవారి విగ్రహా న్ని తొలగించి జీర్ణోద్ధరణ అనంతరం ప్రతిష్ఠించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన కుంభాభిషేకాలు నిర్వహించారు. విగ్రహం జీర్ణోద్ధ రణ తరువాత అమ్మవారికి పంచ లోహాల పూతతో కలిగిన చీర కట్టి అలంకరించారు. ఆలయ ప్రధానార్చ కుడు కార్తీక్ స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.



ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు

● రెండు కార్లు, 20 దుంగల స్వాధీనం


స్మగ్లరు, దుంగలను చూపుతున్న పోలీసులు

మంగళం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ కథనం మేరకు.. కరకంబాడి- మామండూరు రోడ్డు మార్గంలో ఆంజనేయపురం చెక్ పోస్ట్ వద్ద సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వాహనాలు తనిఖీలు చేపట్టారు. మాముండూరు వైపు నుంచి రెండు కార్లు వేగంగా వచ్చాయి. వాటిని ఆపగా ఒక వాహనంలోని డ్రైవర్ పారిపోయాడు. మరో వాహనంలోని కర్ణాటకకు చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. కార్లలోని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠంలో రూ.2లక్షలున్న బ్యాగు పోగొట్టుకున్న భక్తురాలు

● భద్రంగా అప్పగించిన సిబ్బంది



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో రూ.రెండులక్షలకు పైగా ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను పోగొట్టుకున్న భక్తురాలికి భద్రతా సిబ్బంది తిరిగి అప్పగించారు. బెంగుళూరుకు చెందిన జ్యోత్స్న అనే భక్తురాలు సోమవారం రాత్రి సర్వదర్శన క్యూలైన్ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి ప్రవేశించారు. అక్కడ లగేజీని స్కాన్ చేసుకునే క్రమంలో హ్యాండ్‌బ్యాగును పోగొట్టుకున్నారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ రాజీవ్ దానిని భద్రపరిచి, తిరిగి అప్పగించారు. అందులో రూ.2,07,494 ఉంది.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి


షబ్బీర్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ షబ్బీర్(46) అనుమానా స్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... షబ్బీర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ ఇంటి నుంచి అలిగి వెళ్లినట్లు తెలిసింది. మంగళ వారం భరత్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో షబ్బీర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వా స్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఒడిశా నుంచి కర్నాటకకు వెళ్తున్న లారీ అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో కారును ఢీకొనడంతో, ఆ కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో కారు, బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బొమ్మరాజు రఘునాథరావు తన భార్య పేరు మీద రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి అంతరాలయ దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద మంగళవారం రెండవ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రోగుల భద్రత, వైద్యసిబ్బంది విజ్ఞప్తి మేరకు రాత్రి పూట పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ మార్గంలో ప్రయాణం ఇబ్బందికరం


దారిపొడవునా ఇలాంటి గుంతలే

భాకరాపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు చెరువు మొర నుంచి రొంపిచెర్ల క్రాసు వరకు రోడ్డు ఇబ్బందికరంగా తయారైంది. సుమారు 20 ఏళ్ల క్రితం ఈ తారురోడ్డు నిర్మించారు. తారు లేచినా మళ్లీ వేయలేదు. గుంతలు పడినప్పుడల్లా చిన్నపాటి మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ఈమార్గం ఎనిమిది కిలోమీటర్లు ఉంటుంది. ఇందులో ఐదు కిలోమీటర్లు తిరుపతి డివిజన్‌లో, మదనపల్లె డివిజన్‌లో రెండు కిలోమీటర్లు ఉంది. దీంతో ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. కొన్ని చోట్ల రోడ్డు మీదకు వచ్చేశాయి. దీనికితోడు అక్కడక్కడ ప్రమాదకర మలుపులున్నాయి. చెట్లు పెరగడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనబడడంలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అప్పుడప్పుడు డోజర్‌తో చెట్లను పక్కకు తోసినా మళ్లీ పెరిగి రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే పక్కకి తొలగాలంటే ఇబ్బందిగా ఉంది. కొన్ని చోట్ల రోడ్డు కుంగిపోయింది. . దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను పూర్తిస్థాయిలో తొలగించి మళ్లీ తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులకు దీటుగా ఏపీ రైళ్లు?

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా తిరుపతి సమీప ప్రాంతాల్లో రైల్వే ప్రాజెక్టులు, స్టేషన్లను అభివృద్ధి చేయాల్సిన అవసరముంది. పార్లమెంట్ కమిటీ ఈ కోణంలో దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రయాణికులకు దీటుగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్ళు పెంచాలి. ముఖ్యంగా సమీప రైల్వే స్టేషన్లు టెర్మినల్స్‌గా అభివృద్ధి చేయాలి. పుణ్యక్షేత్రాల మధ్య మెమూ ప్యాసింజర్ రైళ్ళు నడపాలని చాన్నాళ్లుగా కోరుతున్నారు. దేశంలో ఏగ్రేడ్-1 రైల్వేస్టేషన్లలో తిరుపతి కూడా ఉంది. విశాఖ తరహాలోనే తిరుపతిలో బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. బుధవారం పర్యటించనున్న జీఎం ఇక్కడి రైల్వే పరమైన సమస్యలను పరిష్కరించాలని ప్రజానీకం ఆశిస్తోంది.

ఇవీ అవసరాలు

- తిరుపతి-రేణిగుంటల మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలి.
- రేణిగుంట రైల్వే జంక్షన్‌ను మరో టెర్మినల్ చేయాలి.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై రైల్వే జీఎం స్పందించేనా..

- బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి.
- చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాలి.
- తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలి. అక్కడ నుంచే కొన్ని ప్యాసిజర్ రైళ్ళను నడిపేలా చర్యలు తీసుకోవాలి.
- తిరుపతి- చిత్తూరు- శ్రీకాళహస్తి- తిరుత్తణి-కడప రైల్వే స్టేషన్ల మధ్య ప్యాసింజర్ రైళ్ళను నడపాలి. ● పాకాల రైల్వే జంక్షన్‌కు తగిన ప్రాధాన్యత కల్పించాలి.

ఉపాధి హామీ పనుల్లో రూ.48వేల రికవరీకి ఆదేశం



మాట్లాడుతున్న పీడీ, ఇతర అధికారులు

తిరుపతిరూరల్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిపనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధిచి రూ.48వేల రికవరీకి ఆదేశించామని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదికసభ జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.9.62 కోట్లతో 1215 పనులను చేపట్టారు. ఈ పనులపై సామాజిక తనిఖీ బృందసభ్యులు క్షేత్ర స్థాయిలో విచారించి గ్రామసభల ద్వారా నిర్ధారించిన వివరాలను వెల్లడించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ పనుల్లో లోపాలకు సంబంధించి పలువురు క్షేత్రసహాయకుల నుంచి రూ.48వేల రికవరీకి ఆదేశించామన్నారు. పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్‌రికగ్నైజ్ యాప్ వచ్చేవారం నుంచి అమలు చేస్తామన్నారు. పెరుమాళ్లపల్లెలో మస్టర్ విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పీడీ పెరుమాళ్లపల్లె, పేరూరు పంచాయతీల్లో విజిలెన్స్ విచారణకు పీడీ ఆదేశించారు. ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, డీఆర్‌డీవో పీడీ ప్రభావతి, ఎస్ఆర్పీ లోకేష్, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు .ఈశ్వర్‌రెడ్డి, వైస్ఎంపీపీ మాధవరెడ్డి, ఏపీఎంలు జ్యోతిశ్రీ, మమతారాణి, అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్


శ్రీసిటీ ప్రతినిధులతో కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్

సత్యవేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని కొరియా రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ చాంగ్ న్యూస్ కిమ్ తమ అధికారుల బృందంతో కలిసి మంగళవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్, శ్రీసిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడ్గన్ జార్జ్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా శ్రీసిటీలోని పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్‌తో సహా పలు కొరియన్ సంస్థలు ఇక్కడ సంస్థలు నెలకొల్పడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను కొనియాడుతూ రాష్ట్రంలోని రవాణా వసతులు, నైపుణ్యత, వ్యాపార ప్రయోజనాలకు శ్రీసిటీ అద్దం పడుతోందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో ఉన్నాయని వివరించారు. కొరియాకు చెందిన ఎల్జీ, సోలెం, హెచ్‌డీసీ, ఎస్‌కే ఫ్యుకోర్, ఎల్జీ పాలిమర్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు శ్రీసిటీలో విజయవంతంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు.

ఆంత్రాక్స్ నిర్మూలనకు గ్లోబల్‌స్థాయి చర్యలు అవశ్యం


జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ కుమణన్, డాక్టర్ రాణీప్రమీల

తిరుపతి రూరల్,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని రాష్ట్రీయ పశువ్యాధి నిర్ధారణ లేబొరేటరీ, బయోటెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆంత్రాక్స్ వ్యాధి నిర్మూలన-సవాళ్లపై రెండురోజుల జాతీయసదస్సు మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా ప్రత్యేక నిపుణులు ఎక్స్‌పర్ట్ డాక్టర్ కె.కుమణన్(తమిళనాడు),డాక్టర్ నరేష్ జిందాల్(హరియాణా)లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆంత్రాక్స్ జూనోటిక్ కావడంతో జంతువులు, మనుషులతోపాటు వాతావరణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధి నియంత్రణకు గ్రామస్థాయి నుంచి గ్లోబల్ స్థాయి వరకూ చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా జంతువులకు వ్యాక్సినేషన్ వేయాలన్నారు. వ్యాధితో మృతిచెందిన జంతువుల కళేబరాలను సరైన పద్ధతిలో ఖననం చేయాలన్నారు. శాస్త్రీయంగా క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. వర్సిటీ డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ ప్రొఫెసర్ శోభామణి, సీవోఈ ప్రొఫెసర్ చెంగల్వరాయులు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాణీప్రమీల,తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో మాక్ డ్రిల్


స్పృహ తప్పిన వ్యక్తిని కాపాడడమిలా..

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భక్తులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఆర్ ఏఎస్పీ నంద కిషోర్, వరసిద్దుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ సూచించారు. మంగళవారం ఆలయం వద్ద పోలీసులు అనూహ్య సంఘటనలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుకోని సంఘటనలు జరిగితే చాకచక్యంగా వ్యవహరించాలని చెప్పారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా పెద్ద ప్రమాదం జరగకుండా చూసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగితే మంటలు వ్యాపించకుండా చేయాలని, అవసరమైన పరికరాలను దగ్గర్లో ఉంచుతామని తెలిపారు.

కేసు విత్‌డ్రా చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటా!

● ఫిర్యాదుదారురాలిని వేధించిన నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచార కేసును వెనక్కి తీసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించిన నిందితుడిని మంగళవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. గతంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో మల్లంగుంట పంచాయతీకి చెందిన బిరుదాల ఈశ్వరరెడ్డి జైలుకెళ్లాడు. ఇటీవల బెయిల్‌పై వచ్చిన ఇతడు.. కేసు విత్‌డ్రా చేసుకోకుంటే ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ ఫిర్యాదుదారురాలిని బెదిరిస్తున్నాడు. మరోవైపు ఇంట్లోని వస్తువులు, ఫర్నిచర్‌ను తగులపెట్టి గ్యాస్ లీక్ చేసిన ఘటనలో అందిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఈశ్వరరెడ్డిని చిత్తూరులో అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ చెప్పారు.

వైసీపీ యాప్‌లో పేరు ఎక్కితే పెన్షన్లు రావు జాగ్రత్త..!

ఎంపీపీ హెచ్చరిక

రేణిగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ త్వరలో తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు ఎక్కితే రటైరయినా పింఛను రాదని వైసీపీకి చెందిన ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మంది రంలో ఆయన అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించపోవడంపై ఆయన స్పందిస్తూ ప్రభు త్వాలు వస్తుంటాయి పోతుంటాయని అభివృద్ధి జరగాలి అంటే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో త్వరలో వైసీపీ తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు నమోదైతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ కూడా రాదని హెచ్చరించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు సభలో మాట్లాడు తూ మండలంలో వీధి శునకాల దాడులు పెరిగిపోతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెటర్నరీ, పంచాయతీ అధికారులు సమన్వయంతో కుక్కలను పట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని కార్యదర్శి తెలిపారు. కుక్క కాటు వ్యాక్సిన్ రేణిగుంట పీహెచ్‌సీకి అధికంగా ఇవ్వాలని అధికారుల దృష్టికి తెచ్చారు. గాజులమండ్యం గ్రామంలో కాల్వను పూడ్చి ఇంటిని నిర్మిస్తున్నారని దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా షిరిడీ పుష్కర మహాకుంభాభిషేకం

కేవీబీపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కళత్తూరు గ్రామంలో కొలువైన షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు షిరిడీ పుష్కర మహాకుంభాభిషేకం పూజలు జరుగుతున్నాయని శ్రీసాయి సేవా ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. అఖండ దీపారాధన, దీక్షా ధారణ, రక్షాబంధనం, అంకురార్పణ, ప్రతిష్ఠ సంకల్పం, కలశ స్థాపన వంటి పూజలు నిర్వహించారు.

డ్యూటీ టైంలో బయట తిరుగుతారా?

● సచివాలయ లైన్‌మెన్ సంఘ నాయకులపై కలెక్టర్ సీరియస్

● చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ● నలుగురు జేఎల్ఎంలకు నోటీసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ లైన్‌మెన్(జేఎల్ఎం (గ్రేడ్-2) సంఘ నాయకులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వారిపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ను ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జేఎల్ఎం నాయకులు హాజరయ్యారు.ఉన్నతోద్యోగాలు పొందడానికి రాత్రి కళాశాలకు వెళ్లి చదువుకుంటామని అధికారులను కోరినా స్పందించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న జేసీ విద్యాధరి గతంలో సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. సచివాలయ, విద్యుత్ అధికారులతో సమస్యపై చర్చించినట్లు తెలిపారు. అత్యవసర సేవల విభాగంలో పనిచేస్తున్న వారికి ఉదయం విధులు, రాత్రివేళ శిక్షణకు దీర్ఘకాలిక అనుమతి ఇవ్వడం కుదరదని చెప్పామన్నారు. కావాలంటే సెలవు పెట్టుకొని శిక్షణ తీసుకోవచ్చని తెలియజేసినట్లు వెల్లడించామన్నారు. దీంతో కలెక్టర్ ఆగ్రహించి సంబంధిత అధికారులతో విషయం మాట్లాడాక కొత్తగా తనకు తెలపడం ఏమిటన్నారు. పైగా అధికారులు అనుమతి ఇవ్వడం లేదని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ని పిలిచి విధి నిర్వహణ సమయంలో వచ్చిన జేఎల్ఎంలు అనుమతి కానీ సెలవు కానీ తీసుకున్నారా అని అడగ్గా తీసుకోలేదని ఆయన చెప్పడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీంతో నలుగురు ఉద్యోగ సంఘ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.డ్యూటీ టైంలో అనుమతి తీసుకోకుండా బయట తిరుగుతున్న కారణంగా ఈ నోటీసులు ఇచ్చారు.అలాగే ఆ జేఎల్ఎంలకు సంబంధించిన నలుగురు ఏఈలకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

ఫొటోగ్రఫీ జ్ఞాపకాల పదిలానికి దృశ్యరూపం



ప్రదర్శనలో ప్రసంగిస్తున్న ఇనేష్ సిద్ధార్థ

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అసంఖ్యాక జ్ఞాపకాల పదిలానికి ఫొటోగ్రఫీ దృశ్యరూపం ఇస్తుందని వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫొటోగ్రఫీ గురించి వివరిస్తూ వైల్డ్‌లైఫ్, ఫ్యాషన్, మాక్రో, మొబైల్, నేచర్, న్యూబోర్న్ ఫొటోగ్రఫీ వంటి రకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ బృందం సభ్యులు వెంకటముని, మనోజ్, వంశీ, చక్రీ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగమ శాస్త్రాన్ని ఈ తరం అధ్యయనం చేయాలి

● సంస్కృత వర్సిటీ డీన్ రజనీకాంత్ శుక్లా



డీన్ రజనీకాంత్ శుక్లాను సత్కరిస్తున్న ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆగమ శాస్త్రాన్ని ఈ తరం అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా అన్నారు. గత రెండు రోజులుగా ఆగమాలపై జాతీయ సదస్సు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సదస్సు సమాపనోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ.. ఆగమాల వైశిష్ట్యాన్ని తెలియచేయడానికి సంస్కృత విశ్వవిద్యాలయం ఎంతో కృషి చేస్తుందన్నారు. చిన్న వయసు నుంచే ఆగమాలను గురించి కొత్త తరానికి తెలియచేయాలన్న లక్ష్యంతో సంస్కృత విశ్వవిద్యాలయం పని చేస్తుందన్నారు. పత్ర సమర్పకులను సదస్సు నిర్వాహకులు ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో రేడియాలజీదే కీలకం

● స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్ డిసిప్లినరీ వైద్య బృందాలు భవిష్యత్తులో వినియోగించే సంక్లిష్ట యంత్రాంగాల్లో రేడియాలజీ కీలకమైన గేర్‌గా పనిచేస్తుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో మంగళవారం రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ రేడియాలజీ గోల్డ్ మెడల్ చైర్ ఓరియేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రేడియాలజీ నిపుణుల మధ్య కమ్యూనికేషన్ మెరుగుపరుచుకునేందుకు, వారి అనుభవాలను పంచుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం వైద్యరంగంలో రేడియాలజీ ప్రాముఖ్యత భవిష్యత్తులో రేడియాలజీలో అందించే అధునాతన వైద్య విధానాల గురించి నిపుణులు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కాలేజీ ఆఫ్ రేడియాలజీ, ఇమేజింగ్ మాజీ చైర్మన్ డాక్టర్ వీ.ఎస్.వరప్రసాద్, వైద్యాధికారులు ముక్తేశ్వరయ్య, లక్ష్మీ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

● సీఐటీయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షుడు జి.బాల సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ రెండవ మహాసభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న వారు మాట్లాడుతూ తమ పార్టీని గెలిపిస్తే ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు ఎన్నికల ముందు హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా నేటివరకు పరిష్కరించకపోవడం అన్యాయమని విమర్శించారు. ప్రైవేటు కంపెనీలైన ఓలా, ఉబర్, రాపిడోల వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు రాయితీతో ఆటోలు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదని వారు మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 21ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు టి.మురళి, కె.లక్ష్మయ్య, బాదుల్లా, వై.కుమార్, వాసు, సీఐటీయూ నాయకులు ఎస్.జయచంద్ర, వేణు, టి.సుబ్రమణ్యం, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం: సీపీఎం

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో కూటమి ప్రభుత్వం 30 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దుచేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం వికలాంగులకు మెరుగైన పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. సమాజంలో నిరాదరణకు గురైన వికలాంగుల పింఛన్లు రద్దుచేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రద్దు చేసిన వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వికలాంగులు చేపట్టే ఆందోళనలో తమ పార్టీ ప్రత్యక్షంగా పాల్గొంటుందని ఆయన తెలిపారు.

అలరించిన హరికథా గానం



హరికథా గానం చేస్తున్న రాము

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి రామచంద్ర పుష్కరిణిలోని కళాక్షేత్రంలో మంగళవారం సా యంత్రం జరిగిన హరికథా గా నం అలరించింది. టీటీ డీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ ఆధ్వర్యంలో హనుమంత సందేశం హరికథను ఎం.రాము వినిపించారు. రామాయణంలో సీతాదేవిని వెతకడానికి హనుమంతుడు లంకకు వెళ్లినప్పుడు రాముడి సందేశాన్ని చెప్పడం.. తర్వాత పరిణామాల క్రమాన్ని వివరించిన విధానం ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ కార్యక్రమాన్ని కళాక్షేత్రం ప్రోగ్రాం ఆఫీసర్ జె.పద్మ పర్యవేక్షించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శ్రీనివాసం ఎదుట ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని అనధికారికంగా ఏర్పాటుచేసిన తోపుడుబండ్లను మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. శ్రీనివాసం పక్కన ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో ఆక్రమణల తొలగింపుపై కార్పొరేషన్ సమాయత్తమైంది. అయితే ఆక్రమణల తొలగింపును ఈసందర్భంగా పలువురు అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ప్రతిష్టాత్మక పురస్కారం



డాక్టర్ వీకే సారస్వత్ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ప్రతిష్టాత్మక పురస్కారాన్ని పొందారు. రేర్ ఎర్త్స్‌కు సంబంధించి బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో దేవప్రసాదరాజు విశేష కృషిచేశారు. ఇందుకు గుర్తింపుగా రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ పురస్కారాన్ని అందజేసింది. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్ చేతుల మీదుగా ప్రొఫెసర్ దేవప్రసాదరాజు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రేర్ ఎర్త్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఎంఎల్‌పీ రెడ్డి, వర్సిటీ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సీకే జయశంకర్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి తదితరులు దేవప్రసాద్‌రాజును అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



శాంతిప్రియ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎంబీఏ పరిశోధకురాలు కె.శాంతిప్రియ డాక్టరేట్ పొందారు. ఎంపోరింగ్ వుమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ త్రో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ అనే అంశంపై ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

ఫొటోగ్రాఫర్లకు సన్మానం



ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న గోపీనాథ్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాయలసీమ రంగస్థలం సంస్థ ఆధ్వర్యంలో పలువురు ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సన్మానం స్వీకరించిన వారిలో రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ప్రవీణ్, జయంత్‌కుమార్, గోపీలున్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థల చైర్మన్, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి, కొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొట్టె సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుడా క్వార్టర్స్‌లో

అనధికార వేగనిరోధకాలు



నిర్మానుష్య ప్రాంతంలో స్పీడు బ్రేకర్ ఏర్పాటు

తిరుపతి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తుడాక్వార్టర్స్‌లో అనధికార వేగనిరోధకాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్య కూడళ్లు, పాఠశాలలు, మలుపుల వద్ద వాహనాల వేగాన్ని అదుపుచేయడానికి ప్రభుత్వమే వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తుంది. తుడా క్వార్టర్స్‌లో ఉన్న కొందరు ప్రవాసాంధ్రులు పంచాయతీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, నివాసాల్లేని ప్రాంతాల్లో సొంతంగా ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల పొడవుతో ఉన్న మూడు మార్గాల్లో సిమెంటు కాంక్రీటుతో ఎత్తుగా 12 స్పీడుబ్రేకర్లను ఏర్పాటుచేశారు. దీంతో ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. చీకట్లో అంచనా వేయలేక బోల్తా పడుతున్నారు. ఈవిషయంపై తిరుమలనగర్ పంచాయతీ అధికారి మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. స్పీడుబ్రేకర్ల ఏర్పాటు సంగతి తన దృష్టికి తీసుకురాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

డ్రైనేజీ కాలువలపై ర్యాంపులు తొలగించండి

● కమిషనర్ ఎన్.మౌర్య



డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, అధికారులు

తిరుపతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లు, దుకాణాల ముందు డ్రైనేజీ కాలువలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లు తొలగించి, కాలువలను శుభ్రం చేయించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు 32, 36 వార్డుల్లోని కె.కె.లేఔట్, దొడ్డాపురంవీధి, గిరిధర్ దాస్‌లేన్, యాదవవీధి, నిమ్మకాయల వీధి తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, శైలజ, అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పలువురు కాలువలపై మెట్లు, ర్యాంపులు కట్టడంతో మురుగునీరు వెళ్లడం లేదని, చెత్తకుప్పలు తొలగించడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. పట్టణ ప్రణాళిక, ఆరోగ్య శాఖ విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ర్యాంపులు, మెట్లు తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. యాదవవీధిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కేజెక్స్ స్కూల్ సందులో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే శుభ్రం చేయాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఆయా విభాగాల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

'అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి'



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉద్యోగాలు సాధించగలరని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. శ్రీపద్మావతి మహిళావర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు వర్సిటీ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్‌సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఓరియెంటేషన్-ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ సామర్థ నైపుణ్యాలు - లైఫ్ స్కిల్స్‌పై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కృత్రిమమేథ, చాట్‌జీపీటీ, డేటాసైన్స్‌యుగం నడుస్తున్న ఈ తరుణంలో అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటి సాంకేతిక విజ్ఞానంతోపాటు లైఫ్‌స్కిల్స్ కూడా ఎంతో అవసరమని చెప్పారు. సమస్య పరిష్కారం, బృంద నైపుణ్యాలు, నాయకత్వం, నైతిక విలువలు, భావవ్యక్తీకరణలపై పట్టు సాధించాలన్నారు. ఇంజనీరింగ్‌లో నాలుగేళ్లపాటు లక్ష్యాలతో స్నేహంచేయాలని తెలిపారు. శిక్షకులు ఎన్ ఎస్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నిర్వహించే 30 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు అర్థమెటిక్, రీజనింగ్, ఇంగ్లీష్, జనరల్‌నాలెడ్జ్ సబ్జెక్టులలో కామన్ సిలబస్ ఉంటుందని, అకడమిక్ విద్యతోపాటు ఖాళీగా ఉన్న సమయంలో పోటీపరీక్షలపై దృష్టిసారించాలని సూచించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ బి.కిశోరి, కోఆర్డినేటర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌వరకు తెలుగుమాధ్యమాన్ని ప్రారంభించాలి



మాట్లాడుతున్న మహేష్ దేగల

తిరుపతిరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు తిరిగి తెలుగుమాధ్యమాన్ని ప్రారంభించాలని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖలో హిందువుల పండుగ విషయంలో వివక్ష చూపుతున్నారని, హిందూ పండుగలు వచ్చినప్పుడు నిర్లక్ష్యంగా సెలవులు రద్దు చేస్తున్నారని ఆరోపించారు. టీచర్లకి ఐచ్ఛిక సెలవులు ఇచ్చి విద్యార్థులకు మాత్రం తరగతులు నిర్వహించడం సరికాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలని, వీటిని గురించి విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్తీక, మార్గశిర మాసాల్లో పూజల నిమిత్తం హిందూ టీచర్లకు గంట సమయం ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కోరారు. జయచంద్రారెడ్డి, శేషగిరిరావు, గురుప్రసాద్, వెంకటరమణ, ముత్యాలయ్య, బాలాజి, ప్రసాద్, మునిరామిరెడ్డి, పీవీసీకే ప్రసాద్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు శ్రీనివాసులుపై మరో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అక్రమంగా బెదిరించి ఇల్లు నిర్మించుకున్న ఘటనపై 'తిరుపతి వార్త' పక్షపత్రిక ఎడిటర్ మాచర్ల శ్రీనివాసులుపై అలిపిరి పోలీసులు మంగళవారం మరో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చిత్తూరుకు చెందిన ఆనంద్ గత కొన్ని సంవత్సరాల క్రితం స్థానిక సుబ్బారెడ్డి నగర్‌లో రిజిస్ట్రేషన్ ప్లాటు కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని శ్రీనివాసులు కొంతమంది అండదండలతో ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ విషయంపై కొంత కాలంగా వివాదం జరుగుతోంది. ఇటీవల బాధితుడు ఆనంద్ పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన సీఐ రాంకిషోర్ వాస్తవాలు వెలుగులోకి రావడంతో జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు. పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వర్చువల్ విధానంలో ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ లోపం లేకుండా నగరపాలకసంస్థ, మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు నీటి కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాల మరమ్మతులుంటే బాగు చేయాలని, లేకుంటే విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. మలేరియా, డెంగ్యూ,చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్యఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. 422 రెవెన్యూ గ్రామాల్లో సంయుక్త సర్వేలు నిర్వహించాలని సర్వేయర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వోనరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మాండ్, డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో డిజిటల్ క్యూఆర్ కోడ్‌లు

ఏర్పాటు చేసుకోండి

● లేదంటే ఆటోలను సీజ్ చేస్తామంటూ ఎస్పీ హెచ్చరికలు

● తిరుపతిలో కాలినడకన ఆకస్మిక తనిఖీలు



ఆటోలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో ఆటోలకు డిజిటల్ క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసుకోకుంటే సీజ్ చేస్తామని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎస్పీ కాలినడకన పలు ప్రాంతాల్లో తిరిగారు. తొలుత ఎంఆర్‌పల్లె సర్కిల్, అన్నమయ్య సర్కిల్ మీదుగా పూర్ణకుంభం సర్కిల్‌కు చేరుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అధ్వానంగా ఉండటంతో.. అక్కడే విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ డీఎస్పీని పిలిచి తక్షణం నియంత్రించాలని ఆదేశించారు. దాదాపు అరగంట పాటు ట్రాఫిక్ తీరును పరిశీలించారు. ఎక్కడ పడితే అక్కడ ట్రావెల్స్ బస్సులను ఆపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. పూర్ణకుంభం సర్కిల్‌కు నాలుగు వైపులా ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు. నిర్ణీత ప్రదేశాల్లో పార్కింగ్ చేయని ప్రైవేటు బస్సులపై కేసులు పెట్టాలన్నారు. అక్కడ్నుంచి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు చేరుకున్న ఎస్పీ.. వ్యాపారులతో మాట్లాడారు. 'పోలీసులపరంగా సమస్యలు ఉన్నాయా? మా వాళ్లు వస్తున్నారా లేదా? మార్కెట్‌లో మందుతాగడం, దొంగతనాలు జరుగుతున్నాయా? ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఉన్నాయా' అని అడిగారు. ఇటీవల ఒంగోలు భక్తులను కొందరు ఆటోవాలాలు ఇబ్బంది పెట్టి దౌర్జన్యానికి దిగిన సంఘటనపై సీరియస్‌గా స్పందించిన ఎస్పీ రైల్వే స్టేషన్‌లో ప్రధాన గేటు వద్ద వున్న ఆటో స్టాండు వారితో మాట్లాడారు. ఎవరైనా భక్తులను ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వస్తే సీరియస్‌గా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వున్న ప్రతి ఆటోకు డిజిటల్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్ ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించారు. రెండు రోజుల్లో స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొన్ని ఆటోలకు ఏర్పాటు చేసిన డిజిటల్ స్టిక్కర్లను ఎస్పీ స్కాన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




రమ్యశ్రీ,ఆమని - ప్రియదర్శి

తిరుమలలో సినీ నటుల సందడి

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు సినీ నటులు దర్శించుకున్నారు. వీరిలో ఆమని, రమ్యశ్రీ, ప్రియదర్శి ఉన్నారు. ఇంకా తెలంగాణ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజున కుటుంబం అంతా కలిసి స్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో నీటి నిల్వలపై అదనపు ఈవో సమీక్ష



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నీటి నిల్వలపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో తిరుమల, తిరుపతి ప్రాంతాల్లోని డ్యాముల్లో నీటి లభ్యత, వినియోగంపై చర్చించారు. తిరుమలలోని గోగర్భం, కుమారధార, పసుపుధార, పాపవినాశనం, ఆకాశగంగ, తిరుపతిలోని కల్యాణి డ్యాముల్లో ప్రస్తుతం భక్తుల అవసరాలకు నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు నివేదించారు. భవిష్యత్తులో నీటి నిల్వల సామర్థ్యం పెంచుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని అదనపు ఈవో సూచించారు. ఈ సమీక్షలో వాటర్‌వర్క్స్ ఈఈ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిది షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.88 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,502

తలనీలాలు సమర్పించినవారు: 31,890



రైల్వే వంతెన కింద ఇరుక్కున్న ట్యాంకర్

- గంటన్నరకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం



రేణిగుంట ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని రైల్వే వంతెన కింద గ్యాస్ ట్యాంకర్ ఇరుక్కుంది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమలకు గ్యాస్ తీసుకెళ్లే ట్యాంకరుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని భావించారు. శ్రీకాళహస్తి వైపు నుంచి ఖాళీ గ్యాస్ ట్యాంకరుతో తిరుపతి అర్బన్ మంగళంలోని ఆర్టీవో కార్యాలయానికి బయలదేరారు. దారి తెలియక పాత చెక్‌పోస్టు మీదుగా రైల్వే వంతెన కింద ట్యాంకరును వెళ్లనిచ్చారు. ఈ క్రమంలో భారీ పరిమాణం కలిగిన ట్యాంకరు ఆ దారిలో ఇరుక్కుపోయింది. దాదాపు ఒకటిన్నర గంటసేపు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్సు చిక్కుకు పోయింది. ఈ విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అబార్షన్ కిట్లు, డ్రగ్స్ స్వాధీనం

వరదయ్యపాళెం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలోని ఓ మందుల దుకాణంలో చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న అబార్షన్ కిట్లను, డ్రగ్స్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్వాధీనం చేసుకున్నారు.మండలకేంద్రంలోని మందుల దుకాణాల్లో మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (శ్రీకాళహస్తి) ప్రశాంతి ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఓ మందుల దుకాణంలో ఎలాంటి అనుమతులుల లేకుండా చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న 140 అబార్షన్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. రోగులకు మత్తు ఇవ్వడానికి వినియోగించే డ్రగ్స్‌ను అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశారు.

తిరుమల ఏటీఎంలో కర్ణాటక వాసి హంగామా



తిరుమల, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎంలో సోమవారం రాత్రి ఒక వ్యక్తి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నానా హంగామా సృష్టించాడు. రాత్రి 11.30 గంటల సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ ముందున్న ఏటీఎంలోకి ప్రవేశించిన అతడు పలుచోట్ల వైర్లను కట్ చేశాడు. అనంతరం ఏటీఎం మిషన్ చుట్టూ అనుమానాస్పదంగా తిరిగాడు. ఈ దృశ్యాలన్నీ మరో సీసీ కెమెరాలో రికార్డు కావడంతో బ్యాంక్ అధికారులు తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం ఉదయం కల్యాణకట్ట వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. కర్ణాటకకు చెందిన ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించామని, మానసిక స్థితి సరిగాలేదని సీఐ శ్రీరాముడు తెలిపారు. అయినప్పటికీ గతంలో ఏవైనా నేరాలకు పాల్పడ్డాడా అనే కోణంలోనూ విచారిస్తున్నామన్నారు.

అటువంటి ఆలయం ఇక్కడొద్దు


- కొండూరులో గుడి నిర్మాణంపై గ్రామస్తుల అభ్యంతరం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు శరత్‌బాబు

తడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని కొండూరులో వివాదాస్పదంగా మారిన దేవాలయ నిర్మాణం విషయమై మంగళవారం తహసీల్దారు శరత్‌బాబు గ్రామసభ నిర్వహించారు. గుంట పోరంబోకు భూమిలో చాముండేశ్వరిదేవి ఆలయం పేరుతో నిర్మాణాలు మొదలుపెట్టి, అందులో చేతబడులు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై కొండూరులో గ్రామసభ నిర్వహించి స్థానికుల అభిప్రాయాలు తీసుకుని నివేదిక పంపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. దీంతో తహసీల్దారు గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో పాటు పంచాయతీ వార్డు సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు వంతులకుపైగా గ్రామస్తులు అటువంటి దేవాలయం ఇక్కడ వద్దని, వెంటనే దానిని తొలగించాలంటూ తహసీల్దారుకు విన్నవించారు. తమకు సమాచారం ఇవ్వకుండా, అజెండాలో పేర్కొనకుండా దేవాలయ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఇవ్వడంపై పలువురు వార్డు సభ్యులు అభ్యంతరం తెలిపారు. వెంటనే వార్డుసభ్యుల సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను నమోదు చేసి నివేదిక సమర్పించాలని పంచాయతీ అధికారులను తహసీల్దారు ఆదేశించారు. ఈ నివేదికలన్నింటిని ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ, సూళ్లూరుపేట ఎస్‌ఐలు కొండపనాయుడు, బ్రహ్మనాయుడు, సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం



తిరుమల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు మంగళవారం రూ.పది లక్షల విరాళం అందింది. బెంగళూరుకు చెందిన వినుత గణేష్ ఈ విరాళ చెక్కును తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో ముందస్తు తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం బుధవారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారన్న సమాచారం తెలియడంతో మంగళవారం స్టేషన్‌లో అధికారులు ముందస్తు తనిఖీలు చేశారు. బాధ్యతలు చేపట్టిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ స్టేషన్‌లో ఏ ప్రాంతంలో పర్యటిస్తారో తెలియక అన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ చిన్నపరెడ్డిలతో పాటు కమర్షియల్, ఇంజనీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మఠం భవనాల కూల్చివేతకు తొందరపడం

- ప్రత్యక్షంగా పరిశీలించాకే నిర్ణయమన్న కలెక్టర్
- ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం నడిబొడ్డున గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం పరిపాలనా భవనం కూల్చివేత నిర్ణయం తాత్కాలికంగా వాయిదా పడింది. రెండంతస్తుల ఈ పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకర స్థితిలో ఉన్న పై అంతస్తునూ, అదే స్థితిలో ఉండే కింది అంతస్తులోని షాపింగ్ గదులనూ కూల్చివేయచ్చంటూ దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేయడంతో స్థానికంగా నిరసనలు మొదలయ్యాయి. తమ బతుకు తెరువుతో ముడిపడిన అంశమని షాపుల వాళ్లు అభ్యంతరం తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇతర ప్రజాప్రతినిధులు, మఠం, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. పలువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

కూల్చకుండా ప్రయత్నిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

భవనాన్ని పాక్షికంగా కూల్చాలని మాత్రమే ఆదేశాలు వచ్చాయని, 62 షాపుల్లో కేవలం 12 మాత్రమే కూలుస్తారని, అవి కూడా కొట్టకుండా పునరుద్ధరించే అవకాశముందేమో చూస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ భవనం స్థితిగతులను పరిశీలించేందుకు ఐఐటీ నిపుణులకు కలెక్టర్ లేఖ రాయాలని కోరారు. అలాగే హథీరాంజీ మఠం తిరుపతికి గుండె లాంటిదంటూ, ఆధునిక టెక్నాలజీని వాడుకుని భవనాన్ని పరిరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ సూచించారు. భవనాన్ని ఎలా నిలబెట్టాలో ఆలోచించాలని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ కోరారు. ఇదే వయసున్న భవనాల విషయంలో టీటీడీ ఏం చేస్తోందో పరిశీలించాలని సూచించారు. 'తిరుపతిలో ఇంట్లో చావైనా, పెళ్ళైనా ముందుగా వెళ్ళేది మఠం భవనంలో నడుస్తున్న పువ్వుల దుకాణాలకే. వాటిని కూల్చవద్దు.



అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. రిట్రోఫిట్టింగ్ విధానంలో మఠం భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసే వీలుంది.' అని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. తిరుపతికి ల్యాండ్ మార్క్ ఈ భవనాన్ని కూల్చకుండా కాపాడాలని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. ఒకవేళ మఠం భవనాన్ని కూల్చేసి తిరిగి కడితే ఇపుడున్న వ్యాపారులకే మళ్ళీ షాపులు కేటాయిస్తారా? అని నగర బీజేపీ అధ్యక్షుడు వరప్రసాద్ ప్రశ్నించారు. కూల్చకుండానే పునరుద్ధరించి ఇపుడున్న వ్యాపారులకే ఆ షాపులు ఇస్తామంటే తక్షణం షాపులు ఖాళీ చేస్తామని కార్పొరేటర్ నరసింహాచారి చెప్పారు.

భవనం కూలితే బాధ్యత ఎవరిది?

- ప్రశ్నించిన కలెక్టర్

అందరి అభిప్రాయాలూ తెలుసుకున్న తర్వాత కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, వందేళ్లకు పైబడిన పురాతన భవనం శిథిలావస్థకు చేరుకుందని, అది కూలిపోయి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని సూటిగా ప్రశ్నించారు. వ్యాపారుల జీవనోపాధి దెబ్బతీయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. తమ మొదటి ప్రాధాన్యత మనుషుల ప్రాణాలు కాపాడ్డమేనని స్పష్టం చేశారు. దేవదాయ శాఖ అభ్యర్థనపై తిరుపతి ఐఐటీ నిపుణులు భవనాన్ని పరిశీలించారని, అనేక భాగాలు ప్రమాదకర స్థితిలో వున్నాయని నివేదిక ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే దేవాదాయ శాఖ కమిషనర్ భవనం కూల్చివేతకు టెండర్లు పిలిచారన్నారు. అయితే షాపుల్లో అద్దెకు వుంటున్న వ్యాపారులు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు రావడంతో తాత్కాలికంగా టెండర్ల అమలును నిలిపుతామని ప్రకటించారు. ఎమ్మెల్యే, కమిషనర్ సహా ప్రజాప్రతినిధులు, నేతలు, మఠం అధికారులు అందరితో కలసి వారం రోజుల్లో మఠం భవనాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తామన్నారు. దానికి తిరుపతి ఐఐటీ, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను కూడా ఆహ్వానిస్తామన్నారు. ప్రత్యక్షంగా చూసిన తర్వాతే భవనం కూల్చివేతపై నిర్ణయం తీసుకుంటామన్నారు. భవనాన్ని కూల్చకుండా పటిష్టం చేసి పరిరక్షించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సంస్థకూ, పురావస్తు శాఖకు, ఐఐటీకి తానే లేఖలు రాస్తానన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో షాపులు తాత్కాలికంగా ఖాళీ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అది కూడా తాము భవనాన్ని నేరుగా పరిశీలించాకే అవసరమైతేనే ఖాళీ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మౌర్య, హథీరాంజీ మఠం ఇంచార్జి ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బంజారా సంఘాల ప్రతినిధులు, షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.




అవార్డు అందుకుంటున్న లావణ్య కుమార్, సాయికుమార్

అవార్డులందుకున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు

తిరుపతి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన తిరుపతి 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్య కుమార్, కె.సాయికుమార్ అవార్డులు స్వీకరించారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ల్యాప్ ట్యాప్‌ల చోరీ ఆ ఆగంతకుడి పనేనా?

- దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- ఐఐటీలో భద్రతా వైఫల్యంపై విమర్శలు

ఏర్పేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ఏర్పేడు ప్రాంగణంలో ల్యాప్‌టాప్‌ల చోరీ కలకలం రేపింది. శనివారం హాస్టల్ భవనాల్లో విద్యార్థులకు చెందిన 8ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయిన సంగతి తెలిసిందే. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో జరిగిన ఈ చోరీ ఘటనపై విచారణకు సీఐ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఐఐటీని సందర్శించారు. హాస్టల్ భవనాలను తనిఖీ చేశారు. బాధిత విద్యార్థులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ ఫుటేజీతోపాలు పలు సాంకేతిక అంశాల ద్వారా నిందితుడ్ని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరా దుండగుడు?

శనివారం ఓ ప్రొఫెసర్ పేరుచెప్పి ఓ వ్యక్తి ఐఐటీలోకి వచ్చినట్లు తెలుస్తోంది. తమ పిల్లల యోగక్షేమాలు తెలుసుకోవడానికివెళుతున్నానని అతడు చెప్పినట్లు సమాచారం. ఈక్రమంలో హాస్టల్ గదుల్లో ఎనిమిది మంది విద్యార్థుల ల్యాప్‌టాప్‌లను చోరీ చేసి తన వాహనంలో పెట్టుకుని ప్రధాన మార్గంలోనే వెళ్లిపోయాడని భావిస్తున్నారు. ఈ విషయంలో భద్రతా సిబ్బంది తీరు విమర్శలకు దారితీస్తోంది. ఆగంతకుడు సులభంగా లోపలికి రావడం, వెళ్తున్నప్పుడు తనిఖీ చేయకపోవడం చోరీకి ప్రధాన కారణమంటున్నారు. దుండగుడు లోపలికి ప్రవేశించడం వెనుక ఐఐటీకి చెందిన ఓ అధికారి హస్తమున్నట్లు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాప్ నిర్వహించిన అమరావతి చాంపియన్‌షిప్ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల నుంచి 2,362మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, షటిల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ క్రీడాంశాలలో తలపడ్డారు. రెండు రోజులుగా ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలు బాలబాలికలతో కళకళలాడాయి. విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. విజేతజట్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పురుష విభాగంలో ఆర్చరీలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఒకరు, షటిల్ బాడ్మింటన్ ఒకరు, బాక్సింగ్‌లో 10మంది, హాకీ జట్టు, వాలీబాల్ జట్టు, మహిళా విభాగంలో ఆర్చరీలో ఒకరు, అథ్లెటిక్స్‌లో ఇద్దరు, షటిల్‌బ్యాడ్మింటన్ ఇద్దరు, బాక్సింగ్‌లో ఏడుగురు, హాకీ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.



పురుషుల హాకీ విజేత



మహిళల హాకీ విజేత

డీఫార్మసీ దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): డీఫార్మసీ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వైద్వారకానాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ లేదా ఎంపీసీ ఉత్తీర్ణులైన వారు రెండేళ్ల కాలవ్యవధి కలిగిన ఫార్మసీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులు. ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఈనెల 30న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తారు. తెల్లరేషన్ కార్డు లేదా ప్రభుత్వ నిబంధనల మేరకు ఇన్‌కం సర్టిఫికెట్ ఉన్నవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. మరిన్ని వివారలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని లేదా కళాశాలలో ఫార్మసీ విభాగంలో లేదా 99088 57585, 99667 61446, 99635 41557 నంబర్లలో సంప్రదించవచ్చు. apsbtet.in/pharmacy లింక్‌ను ఉపయోగించి ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చు.

వైసీపీ జెండాలతో తిరుమలకు పాదయాత్ర

- అడ్డుకుని 10మందికి పోలీసుల అనుమతి

చంద్రగిరి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో నిందితుడు ఎంపీ మిథున్‌రెడ్డి ఆరోగ్యం బాగుండాలని తిరుమలకు పాదయాత్రగా వస్తున్న వైసీపీ కార్యకర్తలనుచంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. శనివారం వైసీపీ విద్యార్థి సంఘం నాయకుడు హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది పీలేరు నుంచి పార్టీ జెండాలతో తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీనివాసమంగాపురానకి చేరుకున్నారు. పార్టీ జెండాలతో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్ళకూడదని డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీవారి మెట్టు మార్గంలో ధర్నా చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని 10 మందిని అనుమతిస్తామని చెప్పడంతో వారు అంగీకరించారు. అయితే 10 మంది కాకుండా పోలీసుల కళ్లు గప్పి మరో ఆరుగురు వెళ్ళారు. దీంతో టీటీడీ సెక్యూరిటీ, పోలీసులు అప్రమత్తమై ఆ ఆరుగురిని అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.




శ్రీవారిమెట్టు మార్గంలో ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు - వైసీపీ జెండాలతో వాహనం

వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టండి

- విద్యార్థులకు డీఈవో పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేలా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీ హైస్కూల్లో మంగళవారం జరిగిన ఇన్‌స్పైర్ అవార్డ్స్-2025 నామినేషన్ల ఒకరోజు శిక్షణ తరగతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇన్‌స్పైర్ నామినేషన్లలో మన జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) గౌరీ శంకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు వేయాలన్నారు. ప్రదర్శనాంశాలు వినూత్నంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ శివ శంకరయ్య, ఏఎస్‌ఓ సారథి, ఎస్వీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని సంధ్య, డీవైఈవో ఇందిరాదేవి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, రిసోర్స్ పర్సన్లు నీలకంఠ, మేఘనాథ్, హరిశంకర్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

- ఆ భూమి విషయంలో ఏ చర్యలు తీసుకున్నా

చట్టనిబంధనల ప్రకారం నడుచుకోండి

- భూమన కుటుంబ సభ్యుల భూఆక్రమణ విషయంలో రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం
- తహసీల్దారు ఇచ్చిన నోటీసు రద్దు

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పరిధిలో వైసీపీనేత భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు 9.33 ఎకరాల నదీ పోరంబోకు ఆక్రమణ వ్యవహారంలో ఏ చర్యలు తీసుకున్నా చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. తహసీల్దారు ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదని పేర్కొంటూ దానిని రద్దు చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పరిధిలోని సర్వేనెం. 479లోని 9.33 ఎకరాల నదీ పోరంబోకు భూమిని ఆక్రమించారని, అందులోని నిర్మాణాలను తొలగించాలని తిరుపతి గ్రామీణ మండలం తహశీల్దార్ ఈనెల 11న ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భూమన కరుణాకర్‌రెడ్డి భార్య జంగా రేవతి, కుమారుడు అభినయ్ హైకోర్టును ఆశ్రయించారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ఆ భూమిని 2001-02లో కొనుగోలు చేశారన్నారు. తహశీల్దార్ ఇచ్చిన నోటీసు నిబంధనలకు అనుగుణంగా లేదన్నారు. సంబంధిత భూమి నదీ పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలను నోటీసుకు జత చేయలేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు భూమిని ఆక్రమించారనేందుకు ఆధారాలు ఉన్నాయన్నారు. నిబంధనలకు అనుగుణంగానే నోటీసులు జారీ చేశామన్నారు.

పుత్తూరు వార్తలు

శాంతి భద్రతల పరిరక్షణ మా బాధ్యత

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- పుత్తూరు డీఎస్పీ రవికుమార్



డీఎస్పీ రవికుమార్ నేతృత్వంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): 'శాంతి భద్రతల పరిరక్షణ మా బాధ్యత' అని డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరులో ఏరియా డామినేషన్ డే నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు భరోసా కల్పిస్తూ కవాతు తరహాలో ర్యాలీ చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి పాత తిరుపతి రోడ్డు, ఆర్డీఎం గేటు, నారాయణవనం బైపాస్ వరకు కవాతుగా వెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్, కాపువీధి తదితర రద్దీ ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏరియా డామినేషన్ డే నిర్వహణ ద్వారా అసాంఘిక కార్యక్రమాలు చేపట్టాలన్న ఆలోచన ఉన్న వారికి ఓ హెచ్చరిక అన్నారు. గూండాగిరి, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం రాత్రి 10 గంటలలోపు దుకాణాలను మూసి వేయాలని సూచించారు. అనంతరం బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న ఆరుగురు మందు బాబులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రెడ్డిశేఖర్, ఎస్సై ఓబయ్య, ఏఎస్సై పొన్నుస్వామి, భాస్కర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరేటమ్మకు రోజా పాలాభిషేకం



పాలను తీసుకు వస్తున్న రోజా

పుత్తూరు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన పాలాభి షేకంలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. అమ్మవారికి ఆమె స్వయంగా పాలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవానీ శంకర ఆలయంలో మహాశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా మహా రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. మంగళవారం ఉద యం సదా శివుడి మహాలింగానికి వేద మంత్రాలతో అభిషేకం జరిపించారు. పురోహితులు శివ, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో రుద్రహోమం, శాంతి హోమం చేశారు. మహాశివుడి లింగాన్ని పూల మాలలతో విశేషంగా అలంకరించి మంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాల ఏర్పాటు

వడమాలపేట,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి, అప్పలాయగుంట సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. ఈ నెల 20, 21 తేదీల్లో పూడి సచివాలయంలో, 22, 23 తేదీల్లో అప్పలాయగుంట సచివాలయంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చెస్తున్నట్లు చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ సమస్యలు పరిష్కారిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దిలీప్

పుత్తూరు టౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయ సమస్యలను పరిష్కరిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ దిలీప్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో ఈవో జయకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ స్వామివారికి సుప్రభాత సేవలు, మాస శివరాత్రి పూజలు, సోమ, మంగళ శుక్రవారాలలో గోపూజ, ఆలయంలో ప్రత్యేక రోజులలో నిర్వహించే పూజల వివరాలు తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆలయం వెలుపల భక్తుల పాదరక్షకల స్టాండ్ ఏర్పాటు, కార్యాలయ గది మరమ్మతులు, వంటగది ఏర్పాటు, క్లర్క్‌ను నియమించుకోవాలని పాలకమండలి సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు మునికుమార్, సేతురామన్, పార్తీబన్, శ్రీధర్, అమృతవల్లి, పూజిత, వాణి, చిలకమ్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు హెల్త్‌కిట్ల పంపిణీ

వరదయ్యపాళెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు గ్రామంలో పశువులు గేదెల ఆరోగ్య అవసరాలకు ఉపయోగించే బోనస్ హెల్త్ కిట్లను శ్రీజ పాల పరిశ్రమ ప్రతినిధులు వితరణగా అందించారు. గ్రామంలో మంగళవారం జరిగిన పాడిరైతుల సమావేశంలో శ్రీజ సంస్థ సూపర్‌వైజర్ గణేష్, స్థానిక పాలమిత్ర గురవయ్య చేతుల మీదుగా ఈ కిట్లను అందించారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పెయ్య దూడల పెంపకం కార్యక్రమం

పిచ్చాటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు సచివాలయ పరిధిలోని రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు పశు సంవర్ధకశాఖ నిర్వహించే పెయ్య దూడల పెంపకం కార్యక్రమానికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా విచ్చేస్తారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు విచ్చేసి ఆరోగ్యవంతమైన దూడలకు ఇచ్చే ప్రోత్సాహక బహుమతులను తీసుకోవాలని కోరారు. దూడలకు అవసరమైన డి వార్మింగ్ మందు, దాణ, మినరల్ మిక్సర్ అందిస్తామని వివరించారు.

భోజన నాణ్యత పరిశీలన

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్‌ను మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బృందమ్మ పరిశీలించారు. భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అన్నాక్యాంటీన్‌కు ఎదురుగా ఉన్నసమీకృత బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేశారు.

నీటి పన్ను చెల్లించండి

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఉన్న వారందరూ నీటి పన్ను చెల్లించాలని, లేకుంటే కనెక్షన్‌ను తొలగిస్తామని కమిషనర్ చిన్నయ్య చెప్పారు. ప్రజలు నీటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఈ రోడ్లోనే ఆర్డీవో వెళ్లేది!

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు చినుకు పడితే చాలు రొచ్చురొచ్చుగా మారుతోంది. కార్యాలయానికి వెళ్లాలంటే బురద తొక్కాల్సిందే అన్నట్లుంది పరిస్థితి. గాండ్ల వీధిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రోడ్డు గుంతలు ఏర్పడి వర్షపు నీళ్లు నిలబడి అధ్వానంగా ఉంది. కార్యాలయ సమీపంలో రోడ్డుకు పక్కనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్లోనే ఆర్డీవోతో పాటు సిబ్బంది రోజూ కార్యాలయానికి వెళ్లి వస్తున్నారా అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.



అధ్వానంగా ఉన్న ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

పెళ్లకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను నిబంధనలు పాటిస్తూ నిర్వహించుకోవాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు కోరారు. మంగళవారం పెళ్లకూరు పోలీసు స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందిర్లు, మండపాల ఏర్పాటుకు పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీల వివరాలను పోలీసు స్టేషన్‌లో అందజేయాలన్నారు. ఊరేగింపు సమయంలో లౌడ్ స్పీకర్లు, బాణసంచా పేలుళ్లు, డీజేలు, పాటకచ్చేరీలకు అనుమతులు లేవన్నారు. గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ఉండి వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. వివాదాలకు దిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉత్సవ కమిటీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, రైటర్ తిరుపతయ్య, నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, కేవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



షబ్బీర్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ షబ్బీర్(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... షబ్బీర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ ఇంటి నుంచి అలిగి వెళ్లినట్లు తెలిసింది. మంగళవారం భరత్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో షబ్బీర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాల్య వివాహాలు జరక్కుండా చూడాలి



తల్లులు, కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మునికుమారి

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమని, ఈ సాంప్రదాయాన్ని అవగాహనతో తరిమికొడదామని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీ కొండమిట్ట గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తల్లులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల కారణంగా నిరక్షరాస్యత, హింస, వేధింపులు, ప్రసూతి, శిశు మరణాలు, పేదరికం, మానసిక ఆరోగ్యం దెబ్బతీస్తాయన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టడంలో ప్రతి మహిళ కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత, వర్కర్ కోటేశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఆదినారాయణ రెడ్డి



ఎమ్మెల్యే విజయశ్రీ నుంచి ఉత్తర్వుల ప్రతి అందుకుంటున్న ఆదినారాయణ రెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయానికి కమిటీ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి అధ్యక్షుడిగా బీజేపీ నాయకుడు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డిని నియమించారు. అలాగే పట్టుపల్లి మోహన్, పోలూరు లీలామోహన్, చిట్టేటి మధు, మాటిరెడ్డి బేబీ, వెంకటనాగ ప్రమీల, మామండూరు శాంతి, పొల్లమాల సుమతి, ఆనంద నాయుడులను సభ్యులుగా నియమించారు. బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆలయ పాలకమండలి నియామక ఉత్తర్వులను చైర్మన్‌గా నియమితులైన ఆదినారాయణ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, మాధవ నాయుడు, బీజేపీ నాయకులు తన్నీరు శేషగిరిరావు, చెన్నకేశవరావు, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, నూతలపాటి శ్రీనివాసులు, కృష్ణ తదితరులు ఉన్నారు. కాగా, నూతన పాలక మండలి ఈ నెల 25న ప్రమాణ స్వీకారం చేయనుంది.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద నాయీ బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. దేవాలయ కమిటీల్లో నాయీ బ్రాహ్మణులను సభ్యులుగా నియమించేందుకు, వాయిద్య కళాకారులకు రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు జీవనభృతి అందించేలా చర్యలు తీసుకొందన్నారు. కార్యక్రమంలో బాలగురుస్వామి, గురుమూర్తి, గోపాల్, ధనుంజయ్, వెంకటేశ్వర్లు, రాజా, ప్రతాప్, ప్రసాద్, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలతో అభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

కారును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో కారును లారీ ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఒడిశా నుంచి కర్ణాటకకు వెళ్తున్న లారీ అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో కారును ఢీకొనడంతో, ఆ కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో కారు, బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యాయి. కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలు నడుపుకుని జీవనం సాగించే కార్మికులు వీధి పడ్డారని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో కార్మికుల సంఘ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.శివ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఆటో కార్మికులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుధాకర్ రెడ్డి, పురుషోత్తంరెడ్డి, నాగేంద్ర బాబు, బాల తదితరులు పాల్గొన్నారు.

పంచలోహాల చీరతో కామాక్షీదేవి



కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని సంగమేశ్వర ఆలయంలో ఉన్న కామాక్షీదేవిని మంగళవారం పంచలోహ చీర అలంకరించారు. ఇటీవల అమ్మవారి విగ్రహాన్ని తొలగించి జీర్ణోధరణ అనంతరం ప్రతిష్ఠించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన కుంభాభిషేకాలు నిర్వహించారు. విగ్రహం జీర్ణోధరణ తరువాత అమ్మవారికి పంచలోహాల పూతతో కలిగిన చీర కట్టి అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు.

స్వామిత్వపై అవగాహన ర్యాలీ

కోట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ పరిధిలో గల సిద్ధమ్మకండ్రిగలో మంగళవారం స్వామిత్వ సర్వే జరిగింది. ఎంపీడీవో ఏకొల్లు వేణు, పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్వామిత్వపై గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది.

రేపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

బాలాయపల్లి, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 21 తేదీన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనునట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరెడ్డి తెలిపారు.

డక్కిలి పీహెచ్‌సీలో రేపు వైద్యశిబిరం

డక్కిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డక్కిలి పీహెచ్‌సీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి బిందుప్రియ తెలిపారు.

నేడు సూళ్లూరుపేట మండల సమావేశం

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఏవీ మురళికృష్ణ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

నిబంధనల మేరకే చవితి ఉత్సవాలు

తడ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను నిబంధనల మేరకే నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కొండపనాయుడు సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగే మార్గాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని ఆదేశించారు. డీజే మ్యూజిక్ సౌండ్, అశ్లీల డ్యాన్సులు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిమజ్జనం రాత్రి 10 గంటలలోపే ముగించాలని సూచించారు.

చవితి ఉత్సవాల్లో డీజేలు నిషేధం

డక్కిలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్య ప్రదర్శలు నిర్వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే మట్టి గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక వారాహి విద్యావికాస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ మౌనీష్ మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఒంగోలులో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మేథాసింగ్ ప్రథమ స్థానం, వరుణ్‌సందేశ్ ద్వితీయ స్థానం, శషాంక్‌శ్రీసాయి, తనీష్ మూడో స్థానంలో నిలిచారని తెలిపారు.

ఉపాధి అక్రమాలపై విచారణ

బాలాయపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కామకూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై మంగళవారం విచారణ చేపట్టారు. కామకూరు గ్రామంలో జరిగిన ఉపాధి పనుల మస్టర్ల నమోదులో అవకతవకలను ఉపాధి హామీ కమిషనర్ విజయవాడ కార్యాలయ అధికారులు గుర్తించారు. విచారణ చేపట్టాలని జిల్లా డ్వామా కార్యాలయానికి ఆదేశాలు రావంతో మంగళవారం ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

వాకాడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం కానున్నాయని డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగన్నపాళెంలో గ్రామసభ నిర్వహించారు. రైతుల భూ హక్కులకు సంబంధించి ఇప్పటికే పూర్తి చేసిన వివరాలను వెల్లడించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖీల్‌యాదవ్, మండల సర్వేయర్ శకుంతల, వీఆర్వో పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకుల నిరసన

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తమరెడ్డి, శివ మాట్లాడుతూ మోటారు రంగం కార్మికులకు తీవ్రనష్టం కలిగించే జీవోలు 21, 31 వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందజేయాలన్నారు. వాహనాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్, సీవీఆర్ కుమార్, నారాయణ, బాలు, ప్రమీల, శశికుమార్, రమేష్, సునీల్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుంద న్నారు. వినాయక చవితి సందర్భంగా చవితి వేడుకల్లో ఎటువంటి గొడవలు జరకుండా ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

సూళ్లూరుపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వరావు, ఆవుల దాస్, కిరణ్‌కుమార్, శేఖర్, బాబ్జి, దయానంద, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సీనియర్ ఫొటో గ్రాఫర్ బాబర్‌ను సత్కరించారు.

రోడ్లు బురదమయం



బురదగుంటను తలపిస్తున్న కొత్త గొల్లకండ్రిగ నుంచి టీకే పురం సచివాలయానికి వెళ్లే లింకు రోడ్డు

పిచ్చాటూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న ముసురు వానకు గ్రామాల్లోని పలు రోడ్లు బురదమయంగా మారాయి. కొత్త గొల్లకండ్రిగ నుంచి తులసికృష్ణాపురం సచివాలయానికి వెళ్లే లింకు రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగువేస్తే జారి పడాల్సిందే. పాదచారులు బురద తొక్కకుండా వెళ్లలేని పరిస్థితి. ఇక ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా బురదలో పడాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు గ్రామీణ రోడ్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పెన్షన్ల తొలగింపుపై దివ్యాంగుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగుల పెన్షన్ల తొలగింపుపై మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ వికలత్వం 40శాతం కంటే తక్కువగా ఉందనే నెపంతో మండలంలో దివ్యాంగులకు చెందిన పెన్షన్ల రద్దు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తమకు వికలత్వం ఎక్కువగా ఉన్నా డాక్టర్లు తక్కువగా ఇచ్చారని వాపోయారు. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తో కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా జీవిస్తున్నామని ఇప్పుడు ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో వెంకట రత్నమ్మకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 651 దివ్యాంగుల పెన్షన్లు ఉన్నాయని, ప్రభుత్వ ఆదేశాలతో విచారణ చేపట్టడంతో 40 శాతం కన్నా తక్కువ ఉన్న వారి పెన్షన్లు రద్దు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారికి తిరిగి సదరన్ క్యాంపునకు పంపి డాక్టర్ల ద్వారా పరీక్షలు జరిపి అర్హులందరికీ పెన్షన్లు ఇస్తామని తెలిపారు.



మండపాలకు అనుమతి తప్పనిసరి: డీఎస్పీ



డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి అని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేసేవారు శ్రీకాళహస్తి ఆర్డీవో నుంచి అనుమతులు తీసుకోవాల న్నారు. వినాయక విగ్రహాలను రహదారులపై ఏర్పాటు చేయరాదని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించ కూడదన్నారు. ఊరేగింపులో డీజేలు, టపాకాయలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఏర్పేడు: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే గ్రామస్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏర్పేడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటు సమయంలో విద్యుత్ వైర్లకు దగ్గరగా లేకుండా విశాలమైన ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి పేరుతో నిర్బంధంగా చందాలు వసూలుచేయరాదని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కేవీబీపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలకు ప్రభుత్వం ఎన్నో పరిష్కార మార్గాలను చూపిస్తోందని ఏడీ రమేష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువులను తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ సేంద్రియ ఎరువులను వినియోగించి కల్తీ లేని ఆహారాన్ని పొందవచ్చని చెప్పారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువు నిమిత్తం జీలగలు, జనుము విత్తనాలను సబ్సిడీలో అందిస్తున్నారని చెప్పారు. వ్యవసాయాధికారి కృష్ణకుమార్ మాట్లాడుతూ మండలంలో సజ్జ 1,300 హెక్టార్లలో సాగవుతోందని తెలిపారు.

ఘనంగా షిరిడీ పుష్కర మహాకుంభాభిషేకం

కేవీబీపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కళత్తూరు గ్రామంలో కొలువైన షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు షిరిడీ పుష్కర మహాకుంభాభిషేకం పూజలు జరుగుతున్నాయని శ్రీసాయి సేవా ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం అఖండ దీపారాధన, దీక్షా ధారణ, రక్షాబంధనం, అంకురార్పణ, ప్రతిష్ట సంకల్పం, కలశ స్థాపన వంటి పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు క్రీడా పరికరాల పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోబావి గిరిజ కాలనీలో ఉన్న పాపాగారి సుబ్రమ్మ పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 40మంది విద్యార్థులకు చెస్, క్యారంబోర్డు, బంతులు, బ్యాట్ వంటి క్రీడా పరికరాలను వితరణ చేశారు. న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు, సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు బాబాఫరీద్, గాంధీ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు..
రెండు కార్లు, 20 దుంగల స్వాధీనం



రేణిగుంట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ కథనం మేరకు.. కరకంబాడి- మామండూరు రోడ్డు మార్గంలో ఆంజనేయపురం చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వాహనాలు తనిఖీలు చేపట్టారు. మామండూరు వైపు నుంచి రెండు కార్లు వేగంగా వచ్చాయి. వాటిని ఆపగా ఒక వాహనంలోని డ్రైవర్ పారిపోయాడు. మరో వాహనంలోని కర్ణాటకకు చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. కార్లలోని ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి: సీఐ

వరదయ్యపాళెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తియాప్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని అపోలో టైర్స్, శ్రీసిటీలోని ఫ్లెక్స్ ఇండియా పరిశ్రమలలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళలకు శక్తియాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తాం

● ఇన్‌చార్జి ఎంపీడీవో

రేణిగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యదర్శి మాధవికి నోటీసులు జారీ చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రభురావు తెలిపారు. సోమవారం రేణిగుంటలోని పారిశుధ్య కార్మికులు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొన్నారని గుర్తుచేశారు. దీనిపై నోటీసులు జారీచేసి సంజాయిషీ తీసుకుంటామని మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కరాటే పోటీల్లో విజయవాణి విద్యార్థి ప్రతిభ



చంద్రమౌళిని అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయవాణి ఈ-టెక్నో ఒలంపియాడ్ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న చంద్రమౌళి కరాటే పోటల్లో ప్రతిభ చూపాడు. ఈ నెల 17న చెన్నైలో నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్-2025 పోటీల్లో 3వ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్యామలరెడ్డి చంద్రమౌళిని అభినందించి కరాటే గురువుకు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కోచింగ్ జరుగుతోంది. మంగళవారం ఈ శిబిరానికి గ్రీన్ ప్యానెల్ కంపెనీ ఉద్యోగులు బాలసుధీర్, బాలాజీ విచ్చేశారు. అక్కడి సీనియర్ మహిళలు, సబ్‌జూనియర్ బాలికలకు అవసరమైన దుస్తులు, ఎంపిక సమయంలో కావాల్సిన సదుపాయాలను కల్పించారు. ఈసందర్భంగా వారిని ప్రిన్సిపాల్ రాజశేఖర్, పీడీ నరసింహావు, జిల్లా బాల్‌బ్యాడ్మింట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, క్రాంతికుమార్ సత్కరించారు.

పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వద్ద మంగళవారం రెండవ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రోగుల భద్రత, వైద్యసిబ్బంది విజ్ఞప్తి మేరకు రాత్రి పూట పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సూపర్ సిక్స్ పక్కాగా అమలు చేస్తున్నాం : ఆదిమూలం



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కేవీబీపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కృష్ణకుమార్ ఏర్పాటు చేసిన రైతు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ క్షేమంగా ఉంటే దేశం కూడా సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి పెట్టుబడి కింద మూడు విడతల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.20వేలు రైతు ఖాతాలో జమ చేశాయన్నారు. రాని వారు సరైన పత్రాలతో మళ్లీ రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే గతంలో ఇక్కడ పనిచేసిన అధికారుల వలన స్త్రీనిధి నిధులు రాలేదని వాటి కోసం ప్రయత్నం చేస్తున్నానని అవి వచ్చిన తరువాత ప్రతి మహిళా సంఘాలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాలతి, తహసీల్దారు రోశయ్య, ఎంఈవో రవికుమార్, ఏపీఎం ఇందిర, ఏవో రాధారాణి, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, కృష్ణమోహన్, నాయకులు బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, రమేష్, అయ్యప్ప, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఆలత్తూరు రోడ్డు బాగుచేయాలని నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, కత్తివారికండ్రిగ, పుత్తేరి, రెడ్డిగుంటబాడవ గ్రామాల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కత్తివారి కండ్రిగ గ్రామస్తులు మంగళవారం రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఈ రోడ్డులో పదుల సంఖ్యలో క్రషర్లు, క్వారీలు ఉన్నాయన్నారు. వాటి నుంచి టిప్పర్లు అధికలోడుతో వెళ్లడం వలన రోడ్డు గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. వారం రోజులుగా కురు స్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరింది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

వీధుల్లో మురుగునీటిని తొలగించండి





కడవీధిలో రోడ్డుపై నిల్వ చేరిన నీరు, డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఏర్పేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'మీ కాళ్లు పట్టుకుంటాం.. మా గ్రామంలోని కడవీధి, నడివీధి, మిల్లువీధిలో రోడ్డుపై నిల్వ చేరిన మురుగునీటిని తొలగించి మమ్మల్ని రోగాల బారిన పడకుండా కాపాడండి' అంటే ఏర్పే డు డిప్యూటీ ఎంపీడీవో రమణ కుమార్‌ను బండారుపల్లి గ్రామస్తులు వేడుకున్నారు. మంగళవారం బండారుపల్లి గ్రామస్తులు ఎంపీడీవో కార్యాలయం వద్ద మొదట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో రమణ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని మూడు వీధుల్లో నీరు నిల్వ చేరి మురుగు నీరుగా మారిందన్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాలబారిన పడుతున్నామని వాపోయారు. డిప్యూటీ ఎంపీడీవో స్పందిస్తూ మురుగునీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

వేడుకగా ఏకాదశి ఉత్సవం



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న కల్యాణవెంకన్న

నారాయణవనం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో మంగళవారం ఏకాదశి సందర్భంగా సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంలో మాడవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధులు దూరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు టీకాలు వేయడం వలన వ్యాధులు దరిచేరవని మండల ఆరోగ్య అధికారి డీఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని గాజులపెళ్లూరులోని గిరిజన కాలనీలోని ప్రాధమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వివిధ రకాల టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా బ్యాంకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులు, వ్యాపారాలకు విరివిగా బ్యాంకు రుణాలు ఇస్తామని అసిస్టెంట్ రిజిస్టర్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ రవిబాబు తెలిపారు. కాటూరు ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బ్యాంకు రుణాలు సంబంధించి రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు ఎకరాల పొలానికి రూ.5లక్షల రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటి రుణాలు సైతం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, సీఈవో మహేష్, సిబ్బంది చంద్రయ్య పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం తెలిపారు. మండలంలోని నీర్పాకోట, గాజులపెళ్లూరు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, ఏఈవో రేవతి, రైతులు భాస్కర్ యాదవ్, మునిశేఖర్‌రెడ్డి, వీరరాఘవులు, సురేష్‌బాబు, రవిబాబు పాల్గొన్నారు.

చింతలపాళెంలో ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఏర్పేడు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాళెంలో ఈ ఏడాది శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభంగా జరిగాయి. అందులో భాగంగా మంగళవారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు మంగళవారంతో ముగిశాయి.

నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బొమ్మరాజు రఘునాథరావు తన భార్య పేరు మీద రూ.1,01,116ను విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి అంతరాలయ దర్శన ఏర్పాటు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ



సత్యవేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై డీఎల్‌పీవో (డివి జనల్ పంచాయతీ అధికారి)సురేష్‌నాయుడు విచారణ జరిపారు. మండలంలోని చెరివి పంచాయతీలో రూ.50లక్షల మేర నిధులు దుర్వినియోగం చేశారని గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో సురేష్‌నాయుడు స్థానిక ఎంపీడీవో త్రివిక్రమరావుతో కలిసి మంగళవారం చెరివి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని విచారణ జరిపారు. రికార్డులను సబ్‌మిట్ చేయాలని సంబంధిత అధికారులను, సెక్రటరీలను ఆదేశించారు.

ఏరియా ఆస్పత్రిని పరిశీలించిన కమిటీ



రోగులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను సందర్శించి రోగులతో మాట్లాడారు. రోగులు, వారి బంధువులకు పంపిణీ చేస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో సౌకర్యాలు, సేవలను మెరుగు పరిచేందుకు అధికారులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కుమార్, వినయ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో పేరు ఎక్కితే పెన్షన్లు రావు జాగ్రత్త..!



శునకాల దాడులపై మాట్లాడుతున్న రేణిగుంట కార్యదర్శి, సర్పంచ్

వైసీపీ ఎంపీపీ హెచ్చరిక

రేణిగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ త్వరలో తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు ఎక్కితే రటైరయినా పింఛను రాదని వైసీపీకి చెందిన ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించపోవడంపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయని అభివృద్ధి జరగాలి అంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని సూచించారు. లేనిపక్షంలో త్వరలో వైసీపీ తీసుకొచ్చే యాప్‌లో అధికారుల పేర్లు నమోదైతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్ కూడా రాదని హెచ్చరించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు సభలో మాట్లాడుతూ మండలంలో వీధి శునకాల దాడులు పెరిగిపోతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెటర్నరీ, పంచాయతీ అధికారులు సమన్వయంతో కుక్కలను పట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని కార్యదర్శి తెలిపారు. కుక్క కాటు వ్యాక్సిన్ రేణిగుంట పీహెచ్‌సీకి అధికంగా ఇవ్వాలని అధికారుల దృష్టికి తెచ్చారు. గాజులమండ్యం గ్రామంలో కాల్వను పూడ్చి ఇంటిని నిర్మిస్తున్నారని దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో కార్యదర్శుల కొరతతో పాలన గాడితప్పిందని సెక్రకటరీలను నియమించాలని సభ దృష్టికి తెచ్చారు. అర్హులైన వారు ఇంటి జాగా కోసం, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రభురావు, జడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీటీసీలు, సర్పంచులు సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.